క్లుప్తంగా

గురుపౌర్ణమి వేడుకలు వాయిదా

సంతబొమ్మాళి: మండలంలోని చెట్లతాండ్ర గ్రామంలో శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జరగాల్సినన గురుపౌర్ణమి వేడుకలు వాయిదా పడినట్లు సంఘం కార్యదర్శి అంగ మల్లేసు శుక్రవారం తెలిపారు. గ్రామంలో వీరజవాన్ డొక్కరి రాజేష్ మృతి చెందడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని, తదుపరి తేదీ త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

ఆర్థిక సాయం అందజేత



సాయం అందిస్తున్న దాతలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని గుణుపల్లి కాలనీకి చెందిన చొక్కర సందీప్ గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి మండల జనసేన నేతలు శుక్రవారం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో జి.ఈశ్వరరావు, టెంక తేజేశ్వరరావు, కొమర ఈశ్వరరావు, గీత గణపతి, కంబాల రాజు, మదనాల మిన్నారావు పాల్గొన్నారు.

108 వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న పర్యవేక్షణ అధికారి

టెక్కలి రూరల్: టెక్కలి డివిజన్ పరిధిలో 108 అంబులెన్సులను శుక్రవారం డివిజన్ పర్యవేక్షణ అధికారి ఎం.రంగప్రసాద్ తనిఖీ చేశారు. పరికరాలు, మందులు, రికార్డులను పరిశీలించారు. రోగుల పట్ల గౌరవంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈఎంటీ దేవాది శ్రీనివాసరావు, పైలట్ దుర్గారావు పాల్గొన్నారు.

యూరియా బస్తాల పంపిణీ



యూరియా బస్తాలతో అధికారులు, నాయకులు

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ–1, 2 గ్రామ సచివాలయాల పరిధిలో రైతులకు యూరియా, డీఏపీ బస్తాలను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉమాపతి, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు సుగ్గుశాంతి స్వరూప్‌రెడ్డి, వాడరేవు కృష్ణారావు, సీహెచ్ బాబ్జి పాల్గొన్నారు.

తప్పని ఇసుక యాతన



టెక్కలిలో బారులు తీరిన ట్రాక్టర్లు

టెక్కలి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక హామీ గాల్లో కలిసిపోవడంతో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లకు ఇసుక యాతన తప్పడం లేదు. టెక్కలిలో ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ప్రతిజూ రాత్రింబవళ్లు ట్రాక్టర్లు క్యూ కట్టాల్సి వస్తోంది. రాత్రి పగలు తేడా లేకుండా ట్రాక్టర్లను లైన్‌లో ఉంచితే తప్ప లోడ్ ఇసుక దక్కడం లేదు.

ఈదుపురంలో 'బడికి పోదాం'



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: చిన్నారులు ఉండాల్సింది పనిలో కాదని బడిలోనని ఈదుపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తమ్మయ్య అన్నారు. శుక్రవారం విద్యార్థులతో కలిసి 'బడికి పోదాం' ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు పిల్లల్ని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించకుండా విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



కిట్లు అందజేస్తున్న సర్పంచ్ తడక జోగారావు

సోంపేట: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని పలాసపురం సర్పంచ్ తడక జోగారావు అన్నారు. పలాసపురం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాకానుక కిట్లు శుక్రవారం అందజేశారు. కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బల్ల హరికృష్ణ, షణ్ముఖరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రతే మందు!



- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- డయేరియా, డెంగీ నివారణకు సహకరించాలి:వైద్య సిబ్బంది

టెక్కలి:

వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు పంజా విసిరే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే వ్యాధులక్ చెక్ పెట్టవచ్చునని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు. పరిశుభ్రతనే అన్ని వ్యాధులను నియంత్రించంలో మందులాగ పనిచేస్తుందని చెబుతున్నారు. వాతావరణంలో మార్పుల్లో చోటు చేసుకోవడంతో డయేరియా, చికెన్ గున్యా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు విస్తరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.



పరిశుభ్రతపై టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పరిశుభ్రతకు చేపట్టాల్సిన చర్యలు

- క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలి. మంచి నీటి పైపులకు లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలి. వీధి కుళాయిలకు ప్లాట్‌ఫామ్ ఉండాలి. ఓవర్ హెడ్ ట్యాంకులను 15 రోజులు ఒకసారి శుభ్రం చేయాలి.
- దోమలు పెరగకుండా పరిసరాల్లోని నీటి కుంటలను వెంటనే పూడ్చివేయాలి.

పూడ్చడానికి వీలులేని నీటి కుంటలలో కిరోసిన్ లేదా మడ్డి ఆయిల్ గాని వేస్తే దోమల లార్వా నశిస్తుంది. మురుగు కాలువల్లో ఉన్న అడ్డంకులను తొలగించి, మురుగునీరు ఎప్పటికప్పుడు పారే విధంగా చేయాలి.

- గ్రామ పరిసరాల్లోని చెత్త చెదారాలను ఎప్పటికప్పుడు తొలగించి, బ్లీచింగ్, సున్నాన్ని 1:4 నిష్పత్తిలో కలిపి చల్లాలి.
- వర్షపు నీరు చేరకుండా ఇళ్ల పరిసరాల్లో ఉన్న పనికిరాని వస్తువులు, పగిలిపోయిన మట్టికుండలు, కూజాలు, టైర్లు, పూల కుండీలు, తాగిపారవేసిన కొబ్బరి బొండాలు లేకుండా చూడాలి. సెప్టిక్ ట్యాంక్ ఎయిర్ పైపుల పైన జల్లెడకు పల్చని వస్త్రాన్ని చుట్టాలి.

వ్యక్తిగత పరిశుభ్రత ఇలా..

- ప్రజలు సురక్షితమైన మంచి నీటిని వినియోగించాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వీధుల్లో లభించే అపరిశుభ్ర ఆహారం, తినుబండారాలు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. వాటికి దూరంగా ఉండాలి. ఇంట్లో చేసుకునే శుభ్రమైన వేడి ఆహారాన్ని తీసుకోవాలి. చేతులు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలి.
- విరేచనాలు, వాంతులు, జ్వరం ఉన్న వారు అశ్రద్ధ చేయకుండా వెంటనే ప్రభుత్వ వైద్యులను, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను, లేదా మీ సచివాలయం ఏఎన్ఎంలను సంప్రదించి తక్షణ వైద్యసహాయం పొందాలి.
- పంచాయతీ కాలువల్లో చెత్త వేసి పారిశుధ్య సమస్యలు సృష్టించకుండా చూడాలి. మురుగు కాలువలు లేని చోట మంచినీటి కుళాయిలు ఉండే విధంగా చూడాలి.



టెక్కలిలోని అంగన్‌వాడీ కేంద్రంలో వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సీజనల్ వ్యాధులపై అవగాహన



వాతావరణంలో మార్పులతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. వీటి నుంచి రక్షణ కోసం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సోమ, బుధవారాల్లో పాఠశాలల్లో, మంగళ, శుక్రవారాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. డ్రై డే కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించి ప్రతిఇంటికీ వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటున్నాం.

–ఎస్.గాయత్రి, మెడికల్ అధికారి, కె.కొత్తూరు పీహెచ్‌సీ, టెక్కలి మండలం

ఇంటింటా సర్వే చేస్తున్నాం



వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రతి ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. మా పరిధిలో ఆరోగ్య, ఆశ కార్యకర్తలతో పాటు సచివాలయ సిబ్బంది నేతృత్వంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎవరికైనా డయేరియా, డెంగ్యూ, మలేరియా లక్షణాలు ఉన్నట్లు అనుమానం వస్తే తక్షణమే తమను సంప్రదించాలి.

–ఎన్.పాపాయమ్మ, ఆరోగ్య కార్యకర్త, టెక్కలి

భవనం పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సాయికాలనీ సమీపంలో ఐదంతస్తుల భవనం పైనుంచి జారిపడి కుందు శ్రీనివాస్(47) అనే వ్యక్తి మృతిచెందాడు. శుక్రవారం సాయంత్రం భవనంపై సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా కిందకు తూలిపడటంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోటబొమ్మాళి: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ రోణంకి ఉమ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పద్మజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

హాస్టల్ ఆవరణలో పందుల సంచారం



కోటబొమ్మాళి బీసీ హాస్టల్ ఆవరణలో పందులు

కోటబొమ్మాళి: స్థానిక బీసీ బాలుర హాస్టల్ ఆవరణలో తరచూ పందులు సంచరిస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ 195 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇటీవల కొందరు విద్యార్థులు డయేరియా బారిన పడి ఆస్పత్రి పాలయ్యారు. పంచాయతీ పాలకవర్గం స్పందించి పందుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తలిదండ్రులు కోరుతున్నారు.

మహిళల రక్షణకు చట్టాలు

టెక్కలి రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పోష్ యాక్ట్‌పై మహిళా ఉద్యోగులకు ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. మహిళా ఉద్యోగులు పనిచేసే చోట వేధింపులకు గురికాకుండా చట్టాలు భరోసా కల్పిస్తాయని ఐసీడీఎస్ పీఓ శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.విజయ లక్ష్మి, ఏఓ హెచ్.వి.రమణమూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మిస్తాం

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

టెక్కలి: జిల్లా అభివృద్ధిలో భాగంగా ఎయిర్ పోర్టు నిర్మిస్తామని కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. శుక్రవారం టెక్కలిలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో పాటు రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడులకు పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో నిర్వహించిన పౌర సన్మానంలో భాగంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా జిల్లాలోనే ప్రతి పరిశ్రమను ఏర్పాటు చేసే విధంగా చూస్తామన్నారు. జిల్లా నుంచి ఎలాంటి వలసలు లేకుండా పెద్ద పెద్ద పరిశ్రమలు స్థాపించేలా అభివృద్ధి చేస్తామన్నారు. అంతకు ముందు రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ టెక్కలిని బాగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ వర్తక, వ్యాపార సంఘాలతో పాటు సామాజిక సంఘాలు కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బి.శేషగిరి, పట్టణ అధ్యక్షుడు కె.లవకుమార్, మహిళా అధ్యక్షురాలు ఎం.దమయంతి, నాయకులు కె.హరిప్రసాద్, కె.కిరణ్, ఎల్.శ్రీనివాస్, ఎం.రాము, కె.కామేష్ తదితరులు పాల్గొన్నారు.



టెక్కలిలో పౌర సన్మానానికి హాజరైన కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

కేంద్రమంత్రికి స్వాగతం

సోంపేట: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్, పార్టీ శ్రేణులు శుక్రవారం కొర్లాం జంక్షన్ వద్ద ఘన స్వాగతం పలికారు. కేంద్రమంత్రి మొదటిసారి నియోజకవర్గానికి చేరుకోవడంతో అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చారు. దుశ్శాలువలు కప్పి సన్మానించారు.

పెట్టుబడి సాయం ఎప్పుడిస్తారు?

టెక్కలి: కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఎప్పుడిస్తారని ఏపీ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రశ్నించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం టెక్కలి మండలం అయోధ్యపురం గ్రామ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి సాయం కింద ప్రతి రైతుకు రూ.20 వేలు అందజేస్తామని హామీ ఇచ్చినా నేటికీ ఎటువంటి ప్రకటనలు చేయడం లేదన్నారు. తక్షణమే సీఎం చంద్రబాబు స్పందించి పెట్టుబడి సాయంతో పాటు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించాలని, పంట నష్ట పరిహారంపై ప్రకటన చేయాలని, వ్యవసాయ కూలీలకు రెండు వందల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.వాసుదేవరావు, బి.సంజీవ్, భీమారావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: పంట పెట్టుబడి సాయం హామీని వెంటనే అమలు చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు తమ్మినాన భాస్కరరావు, బి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంపల్లి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం సిబ్బంది సిబ్బంది వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బమ్మిడి ఆనందరావు, ఎన్.మోహన్‌రావు, ఎస్.బైరాగి, బి.సుగుణ, లక్ష్మీ, ఈశ్వరమ్మ, టి.మల్లేశ్వరరావు, డి.చలపతి, ఎన్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: రైతు సమస్యలను తక్షణమే పరిష్కరించి పెట్టుబడి సాయం హామీ అమలు చేయాలని ఏ.పి. రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి కప్ప గోపీనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బూరగాం సచివాలయం కార్యదర్శి మహమ్మద్ సల్మాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



టెక్కలి: అయోధ్యపురం గ్రామ సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు



వజ్రపుకొత్తూరు రూరల్: నగరంపల్లిలో వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘ నాయకులు



కంచిలి: బూరగాంలో సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం ప్రతినిధులు

ఎమ్మెల్యే దృష్టికి గురుకుల పాఠశాల సమస్య

వజ్రపుకొత్తూరు రూరల్ : అక్కుపల్లిలోని మత్స్యకార గురుకుల పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో వేరే చోటకు తరలించాలని ప్రిన్సిపాల్ జి.ప్రశాంతి, సిబ్బంది కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎస్సీ వసతిగృహంగా ఉన్న ఈ భవనాన్ని మత్స్యకార గురుకుల పాఠశాలగా 2017లో మార్చారని చెప్పారు. భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో పెచ్చులు ఊడిపోతున్నాయని, వర్షం నీరు కారిపోతుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. తక్షణం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.పాపారావు, పాఠశాల చైర్మన్ రూప, సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

ఫార్మసీ అధికారుల పోస్టులు భర్తీ చేయాలి

కాశీబుగ్గ : పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఫార్మసీ అధికారుల పోస్టుల భర్తీకి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ ఆఫీసర్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనెల గోపాలరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే గౌతు శిరీష పలాసలోని కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఖాళీగా ఉన్న సీనియర్ ఫార్మసీ ఆఫీసర్, ఫార్మసీ ఆఫీసర్స్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఈ విషయమై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ చర్యలు తీసుకుంటామన్నారు.

కిరాణా షాపుల్లో తనిఖీలు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి–కొత్తపేటలోని పలు సూపర్‌బజార్లు, కిరాణాషాపుల్లో జిల్లా పౌరసరఫరాల శాఖ క్వాలిటీ కంట్రోల్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు డి.నాగేంద్ర, బి.గాయత్రి ఆధ్వర్యంలో బృందం నిత్యావసరాల షాపుల్లో అమ్ముతున్న కంది పప్పు, బియ్యం, శనగపప్పు, ఇతర సరుకులను నాణ్యతా పరిశీలన చేపట్టారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పౌరసరఫరాల డీటీ కె.రాము, వీఆర్‌ఓలు పేడాడ అఖిల్, టి.రాము తదితరులు పాల్గొన్నారు.



కందిపప్పు నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

ముంచెత్తిన వాన



కాశీబుగ్గ: వరదనీటితో ప్రమాదకరంగా వరహాలగెడ్డ

కాశీబుగ్గ/పలాస: రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలాస, మందస మండలాలతో పాటు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో వరద నీరు ముంచెత్తింది. ఆంధ్రా–ఒడిషా సరిహద్దుల్లోని మహేంద్రగిరుల నుంచి పలాస మండలంలోకి వరదనీరు వచ్చిచేరుతోంది. వరహాలగెడ్డ రిజర్వాయర్ నిండిపోయి చినంచల, పెదంచల, గంగువాడ మీదుగా కంబిరిగాం వైపు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. కేదారిపురం, బ్రాహ్మణతర్లా వంతెలను తాకుతూ వరదనీరు ప్రవహిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే శనివారం రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో అక్కుపల్లి శివసాగర్ తీరం కల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతుండటంతో సముద్రం కొంతమేర ముందుకు దూసుకొచ్చింది. దీంతో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఇళ్లకే పరిమితమయ్యారు.

ఇచ్ఛాపురం రూరల్: సాగునీరు అందక వరినారు మడులు ఎండిపోతున్న దశలో వర్షపు జల్లులు కురవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు మూడు భారీ వర్షాలు కురిస్తే పంట పొలాల్లో దమ్ములు చేసుకోవచ్చని ధీమా వ్యక్తం చేస్తున్నారు.



వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర తీరంలో ఎగసిపడుతున్న అలలు



కాశీబుగ్గ: కంబిరిగాం ప్రాంతంలో వరదనీరు



పలాస: లక్ష్మీపురంలో నిండిన జంగం చెరువు



ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడు, దొంకూరు పంట పొలాల్లో చేరిన వర్షపు నీరు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ ఆవరణను ఆనుకుని ఉన్న అంబుసోలి ప్రాథమిక పాఠశాలలో గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడే సమయంలోనే మొక్కలు విరివిగా నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. హెచ్ఎం జె.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంఒ పర్యావరణ వేత్త కొత్తపల్లి చిన్నాచారి, ఉపాధ్యాయులు సావిత్రి, చిన బాబు, గ్రీన్ ఆర్మీ సభ్యులు కూన జనార్దన, దిలీప్, తిరుమల పాల్గొన్నారు.



అంబుసోలిలో మొక్కలు నాటుతున్న గ్రీన్‌ఆర్మీ సభ్యులు

జగనన్న కాలనీలో ఎలుగు కలకలం

కాశీబుగ్గ : పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సుమారు రెండువేల మంది లబ్ధిదారులతో ఉన్న జగనన్నకాలనీలో ఎలుగుబంటి సంచరించినట్లు పాదముద్రలు కనిపించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రిజర్వు ఫారెస్టుకు ఆనుకుని ఈ ప్రాంతం ఉండటంతో తరచూ అడవిపందులు, దుప్పులు వస్తున్నాయని పలువురు చెబుతున్నారు. జనావాసాలలోకి ఎలుగులు రాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.